సాక్షి ప్రకాశం

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



ఆర్టీసీ పరిరక్షణ బాధ్యత కానిస్టేబుళ్లదే

ఆర్టీసీని పరిరక్షించే బాధ్యతను నూతనంగా నియమితులైన కానిస్టేబుళ్లు తీసుకోవాలని ఎండీ ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు. - 8లో..



జిల్లాకు చేరిన సాగర్ జలాలు

నాగార్జునసాగర్ ప్రధాన కాలువ నుంచి విడుదలైన జలాలు గురువారం జిల్లాకు చేరుకున్నాయి. జిల్లా సరిహద్దు వద్ద 2,646 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎస్పీకి చీతా సెల్యూట్



ఎస్పీ మలికాగర్గ్‌కు సెల్యూట్ చేస్తున్న పోలీస్ జాగిలం చీతా

ఒంగోలు సబర్బన్: జిల్లాకు నూతన పోలీస్ జాగిలం చీతాను రాష్ట్ర పోలీస్ శాఖ కేటాయించింది. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మలికాగర్గ్ చీతా విన్యాసాలను పరిశీలించారు. మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లోని కెప్టెన్ ట్రైనింగ్ సెంటర్‌లో దాదాపు 8 నెలల పాటు ప్రత్యేకంగా శిక్షణ పొందిన అనంతరం చీతాను జిల్లాకు కేటాయించారు. లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన చీతా పని తీరును పరిశీలించి వివరాలడిగి ఎస్పీ తెలుసుకున్నారు. పేలుడు పదార్థాలను గుర్తించి భారీ ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో చీతా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. చీతా పని తీరు, ఆరోగ్యం, శ్రద్ధ, స్పందన, ప్రతి స్పందన, చురుకుదనం తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. వీవీఐపీల భద్రతకు సంబంధించిన విధులను సమర్థవంతంగా నిర్వహించేలా నిరంతరం శిక్షణ ఇస్తూ కొత్త మెళకువలు నేర్పించాలని పోలీస్ జాగిలం హ్యాండ్లర్ ఏఆర్‌పీసీ ఎస్.విద్యాసాగర్, స్పేర్ హ్యాండ్లర్ పి.ప్రభాకర్‌ను ఎస్పీ ఆదేశించారు. ఉత్సాహవంతమైన విధి నిర్వహణకు సిద్ధంగా ఉంచాలని, అదేవిధంగా సమయానికి ఫీడింగ్ అందించాలని సూచించారు.

చీతా ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ట్రైనింగ్ సెంటర్‌లో ఇచ్చిన సర్టిఫికెట్లను ఎస్పీ మలికాగర్గ్ చేతుల మీదుగా హ్యాండ్లర్లు అందుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కే నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

తాగునీటిపైనే ఫోకస్

- పూర్తిచేసిన హాస్టల్ భవనాలను రెండు వారాల్లో ప్రారంభించాలి
- విద్యార్థులకు సమస్య తలెత్తకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు ఉండాలి
- ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, పక్కన మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జేసీ శ్రీనివాసులు

ఒంగోలు:తాగునీటి ఎద్దడి నివారణపై జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన స్థానిక పాత జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఈ సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత తాగునీటి ఎద్దడి నివారణ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకుని సమావేశంలో బూచేపల్లి వెంకాయమ్మ సమావేశంలో ప్రవేశపెట్టారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తాగునీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు నీటిపారుదల శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, విద్యుత్, పోలీస్, రెవెన్యూ విభాగాలు ఎలా ఉమ్మడి ప్రణాళికతో ముందుకెళ్తున్నాయో సభ్యులకు వివరించాలని ఆదేశించారు. దీనికి అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జునసాగర్ వద్ద నుంచి 5 టీఎంసీల నీరు విడుదలవుతోందని, దానిని జనవరి వరకు తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకునేలా ప్లాన్ చేశామని చెప్పారు. నీరు కూడా కేవలం పదిరోజులు మాత్రమే విడుదలవుతున్న దృష్ట్యా అధిక సామర్థ్యం కలిగిన మోటార్లు వినియోగించి చెరువులకు చేరేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మార్గం మధ్యలో ఎక్కడా నీటి మళ్లింపు జరగకుండా, వ్యవసాయం కోసం వినియోగించకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. తిరిగి జనవరిలో మరో 5 టీఎంసీల నీరు ఉమ్మడి జిల్లాకు విడుదలవుతుందని, అదే విధంగా మరో 5 టీఎంసీల నీరు ఏప్రిల్‌లో విడుదల చేసేలా చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. దొనకొండ మండలంలో హాస్టల్ నిర్మాణం పూర్తయి ఏడాది దాటిని దానిని ప్రారంభించడం లేదని, ఇది ఎంతవరకు సబబంటూ ప్రశ్నించారు. దీనిపై స్పందించిన మంత్రి మేరుగు.. రెండు వారాల్లో జిల్లాలో పూర్తయిన అన్ని హాస్టల్ భవనాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని జేసీ శ్రీనివాసులును ఆదేశించారు. కంభం చెరువుకు సంబంధించి నీటి వృథాను తక్షణమే అరికట్టాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు చేసిన విజ్ఞప్తి మేరకు అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. 'విద్యార్థులు ఉన్నారు. అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయి. కానీ తరగతి గదుల మంజూరులో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి సరికాదు. ఆరు గదులు కాదు.. కనీసం రెండు గదులు నిర్మాణం అవసరమంటూ ఎన్నాళ్లనుంచో చెబుతుంటే.. అనుమతులు రాలేదని చెప్పడం సరికాదు. దీనికి రాష్ట్ర స్థాయిలో అనుమతులిస్తుంటే వారికి అత్యంత అవసరం ఎక్కడో చెప్పి ఆ పనులను ప్రారంభించుకోవాల్సిందిపోయి పైస్థాయిలోనే అనుమతులు వచ్చాయని చెప్పడం ఎంతవరకు సమంజసం' అంటూ అన్నా రాంబాబు ప్రశ్నించారు. దీనిపై మంత్రి సురేష్ జోక్యం చేసుకుని ఇప్పటివరకు మంజూరై ప్రారంభం కాని పనుల స్థానంలో ఎమ్మెల్యే చెబుతున్న పనులను ప్రారంభించేందుకు కలెక్టర్‌తో మాట్లాడి శుక్రవారం అనుమతులిచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇదే విధంగా వ్యవసాయం, గృహ నిర్మాణం, డ్వామా, విద్యా శాఖలపై కూలంకషంగా చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు.

ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిశీలిస్తాం : మంత్రి మేరుగు

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమం అందుతున్న తీరుపై కూలంకషంగా చర్చించడం జరిగిందని, ప్రజాప్రతినిధులు ఇచ్చిన అభిప్రాయాల్ని స్వీకరించి తప్పకుండా వారి సూచనలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఉమ్మడి ప్రణాళికతో ముందుకెళ్లాలని ఆదేశించామన్నారు. పంచాయతీరాజ్, విద్య, వైద్యం, గృహ నిర్మాణ, వ్యవసాయం, డ్వామా తదితర శాఖలపై చర్చ జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవానికి ఆర్థిక చేయూతనివ్వడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడుతుందని భావించి ముఖ్యమంత్రి నేరుగా అవినీతి రహితంగా, మునుపెన్నడూ లేని విధంగా రూ.2.35 లక్షల కోట్లు అందించారన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకునే విధంగా చైతన్యం చేయాలని, అదే విధంగా ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఒక్క నీటిబొట్టూ వృథా కాకూడదు : మంత్రి సురేష్

పదిరోజులు మాత్రమే విడుదలవుతున్న తాగునీటిలో ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చెరువులను ఎలా నింపుకోవాలనే దానిపై సభ్యులు సూచించిన అభిప్రాయాలను తప్పక అమలు చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. 17 శాతం వర్షపాతం తక్కువగా ఉండటం, సాగు విస్తీర్ణం కూడా తక్కువగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వారబందీ కార్యక్రమం అమలుపై తగు సూచనలు చేశారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్ నిర్మాణం ఇంకా కేవలం 500 మీటర్లు మాత్రమే ఉందని, దీనికి సంబంధించి బిల్లుల చెల్లింపు, పనులు ముమ్మరం, పునరావాస సమస్యల పరిష్కారం వంటి పేపర్‌వర్క్‌ను ఈ నెలలో పూర్తిచేస్తామని చెప్పారు. రిజర్వాయర్‌ను త్వరలోనే నీటితో నింపేందుకు అవసరమైన చర్యలకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్ల మరమ్మతులకు తక్షణ చర్యలను డీఈవోలు పరిశీలించాలని, ఎవరైనా ఏజెన్సీలు నిబంధనల అమలులో వైఫల్యం చెందితే వాటికి మరమ్మతులు చేయించి ఆ బిల్లులను ఏజెన్సీలే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీఈవోలను ఆదేశించారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, బాపట్ల జిల్లా జేసీ శ్రీధర్, జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి, జెడ్పీ ప్రత్యేక ఆహ్వానితులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, జెడ్పీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కరణం బలరాం, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి, జెడ్పీటీసీలు

చెరువులు నింపడంలో ప్రత్యేక ప్రణాళిక అవసరం : చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



సాగర్ నుంచి విడుదలవుతున్న నీటిని జాగ్రత్తగా చెరువులకు నింపుకునేందుకు చర్యలు చేపట్టాలి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదురవుతాయి. అవసరమైతే సామర్థ్యం ఎక్కువగా ఉన్న పంపులను వినియోగించాలి. అదనంగా మోటార్లు అందుబాటులో ఉంచుకోవాలి. 24 గంటలు మోటార్లు పనిచేసేలా చూడాలి. ఇక కృష్ణా వెస్టన్ డెల్టాలో కూడా పులిచింతల నుంచి విడుదలవుతున్న 5 వేల క్యూసెక్కుల నీటిని సద్వినియోగం చేసుకుంటూ చెరువులు నింపుకోవాలి.

సీఎంకు కృతజ్ఞతలు : గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు



అర్థవీడు మండలం వెలగలపాయ, పాపినేనిపల్లి గ్రామాలు వెలిగొండ లింకు కింద ఉన్నా చుక్కనీరు వినియోగించుకోలేని పరిస్థితి. గత 12 సంవత్సరాలుగా ఈ సమస్యపై పోరాడుతుంటే ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.320 కోట్లు ప్రకటించారు. మొదటిదశలో భాగంగా రూ.56 కోట్లు విడుదలయ్యాయి. అందుకు సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక శాఖామంత్రి, నీటిపారుదల శాఖామంత్రితోపాటు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారం మెండుగా ఉంది. వీరందరికి కృతజ్ఞతలు.

విద్యార్థుల అవసరాన్ని మరువరాదు : ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి



ఉపాధ్యాయుల బదిలీల సమయంలో విద్యార్థుల అవసరాన్ని మరువరాదు. ప్రస్తుతం 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలలో విలీనమైన నేపథ్యంలో ఆ అవసరాన్ని గుర్తుంచుకుని మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి. ఎక్కడా ఏ విద్యార్థికి సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చర్యలు చేపట్టాలి. ఆ బాధ్యత డీఈవోలు తీసుకోవాలి. ఇక, విద్యాశాఖ అధికారులు జెడ్పీ సర్వసభ్య సమావేశానికి అందిస్తున్న సమాచారం సరిగా ఉండటం లేదు. ఎటువంటి సమాచారం అవసరమో స్పష్టంగా గత సమావేశంలో చెప్పినా మళ్లీ అదే ఇస్తే ఎలా. అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి.

ఇళ్లే కాదు.. ఊళ్లే నిర్మించారు

- దేశ చరిత్రలోనే జగనన్న కాలనీలు చారిత్రాత్మకం
- పేదలకు పెద్ద పండుగలా ఇళ్ల నిర్మాణం
- జిల్లాలో 73,993 ఇళ్లకు రూ.1,330 కోట్లు మంజూరు
- మళ్లీ సీఎంగా జగనన్నను ఆశీర్వదించండి
- చీమకుర్తిలో జగనన్న కాలనీ ప్రారంభోత్సవంలో మంత్రులు మేరుగు, ఆదిమూలపు



చీమకుర్తిలో వైఎస్సార్ జగనన్న కాలనీని ప్రారంభిస్తున్న మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇళ్లనే కాకుండా జగనన్న కాలనీ పేరుతో ఏకంగా ఊర్లనే నిర్మించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున కొనియాడారు. ఇళ్ల నిర్మాణం అనేది పేదలకు అతి పెద్ద పండుగని పేర్కొన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాటప్రకారం రాష్ట్రంలో 32 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాలు అందించి పట్టాలిచ్చి 22 లక్షల ఇళ్లను నిర్మించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించడం దేశంలోనే చారిత్రాత్మకమని అన్నారు. చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని కేవీ పాలెం లేఅవుట్‌లోని వైఎస్సార్ జగనన్న కాలనీని జిల్లాకు చెందిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి గురువారం మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు. తద్వారా జిల్లాలో పూర్తయిన 21,757 ఇళ్లను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ సీఎం నిర్మించినవి ఇళ్లు మాత్రమే కాదని, అవన్నీ కలిసి ఊర్లను తలపిస్తున్నాయని అన్నారు. సీఎం మంజూరు చేసిన 22 లక్షల ఇళ్లలో గురువారం 7.43 లక్షల ఇళ్లను సామర్లకోటలో ప్రారంభించడం గర్వకారణమన్నారు. మన రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా దేశంలో కూడా ఎవరూ అందుకోలేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నెరవేర్చి అక్కచెల్లెమ్మల కళ్లలో ఆనందం నింపారన్నారు. ఆర్థిక సంక్షోభం, కరోనా కాలాన్ని సైతం లెక్కచేయకుండా పేదల సంక్షేమ పథకాలకు ఇప్పటి వరకు రూ.2.35 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు పారదర్శకంగా అందించారని వివరించారు. నిత్యం ప్రజల కోసం శ్రమించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకుంటారో.. లేక ప్రజలను మోసం చేసి యువతకు శిక్షణ పేరుతో కోట్లు దోచుకుని దొరికిన దొంగ చంద్రబాబును ఎన్నుకుంటారో వచ్చే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. దొరికిన దొంగ చంద్రబాబును వదిలిపెట్టాలంటూ పళ్లేలు కొడుతున్నారని, సినిమాల నుంచి వచ్చిన ఇంకొకాయన చంద్రబాబుకు అండగా నిలబడతానని చెప్పుకుంటున్నాడని పవన్ కల్యాణ్‌పై సైతం విమర్శలు చేశారు.

మళ్లీ సీఎంగా జగనన్నను ఆశీర్వదించండి : మంత్రి ఆదిమూలపు సురేష్

అవినీతి రహితంగా అనునిత్యం జవాబుదారీతనంతో పారదర్శకత పాటిస్తూ సమర్థవంతమైన పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని మంత్రి ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. 14 సంవత్సరాల క్రితం పార్టీ పెట్టి పోటీచేసినా.. రెండు చోట్ల ఓడిపోయి అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు ఇంకొక్కసారి అవకాశం ఇవ్వండంటూ అప్పుడప్పుడు రోడ్ల మీదకొస్తున్న పవన్ కల్యాణ్.. చంద్రబాబుకు కొమ్ముకాయడం సిగ్గుచేటని మంత్రి సురేష్ ఎద్దేవా చేశారు. 40–45 లే అవుట్లలో జిల్లాలో దాదాపు లక్షకు పైగా టిడ్కో ఇళ్లను తన శాఖ తరపున ఇటీవలే ప్రారంభించినట్లు మంత్రి సురేష్ తెలిపారు.

జగన్‌కు మహిళలు అండగా నిలవాలి : జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి దేశంలోని ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల వారు సైతం ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మహిళలు తలచుకుంటే జరగనిది ఏదీ లేదని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

73,993 ఇళ్లకు రూ.1,330 కోట్లు మంజూరు : కలెక్టర్ దినేష్‌కుమార్

జిల్లాలో ముఖ్యమంత్రి మంజూరు చేసిన 73,993 ఇళ్లకు రూ.1,330 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి రూ.456 కోట్లను వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్లు చెప్పారు. చీమకుర్తి మున్సిపాలిటీలోని కేవీ పాలెం లేఅవుట్‌ని 11 ఎకరాల్లో నిర్మించామని, రూ.32 లక్షలతో సైడు కాలువల నిర్మాణాలను త్వరలో చేపట్టనున్నామని వెల్లడించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తమ అన్న, మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి, వదిన, మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మతో పాటు తాను కూడా జిల్లాకు అనేక సేవా కార్యక్రమాలు చేశామని గుర్తుచేశారు. రానున్న రోజుల్లోనూ జిల్లా ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల ఇంటి స్థలాలు, 22 లక్షల పక్కా గృహాలతో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాకుండా వేరే వారికి ఓటేస్తే తప్పుచేసిన వారిమి అవుతామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆహ్వానించడంలో అధికారుల పొరపాటు వలన లోపం జరిగిందన్నారు. అందుకు సభాముఖంగా బాలినేనిని క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జిల్లాకు వచ్చే డీఎంఎఫ్ నిధుల్లో మేజరు పార్ట్ చీమకుర్తి గ్రానైట్ క్వారీల ద్వారానే వస్తుందన్నారు. జిల్లాకు రూ.33 కోట్ల వరకు వచ్చే డీఎంఎఫ్ నిధుల్లో రూ.16.5 కోట్ల వరకు చీమకుర్తి మండల అభివృద్ధికి కేటాయించాలని ఇద్దరు మంత్రులు, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. చీమకుర్తిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ఆ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

చీమకుర్తికి ఇద్దరు మంత్రుల ద్వారా రూ.8 కోట్లు మంజూరు...

ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి విజ్ఞప్తి మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున చీమకుర్తికి రూ.6 కోట్లు కేటాయిస్తానని సభాముఖంగా ప్రకటించారు. అదేవిధంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మరో రూ.2 కోట్లను చీమకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి అందిస్తామని భరోసా ఇచ్చారు. తొలుత కేవీ పాలెం లేఅవుట్ జగనన్న కాలనీ ఎంట్రెన్స్‌లోని ఆర్చి, పైలాన్‌ను ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పేరయ్య, డీఈ చెన్నారాయుడు, మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఆరోగ్యశ్రీ స్పెషలాఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, హౌసింగ్ డైరెక్టర్ కే విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు కన్వీనర్లు దుంపా చెంచిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, చీమకుర్తి మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభించిన వైఎస్సార్ జగనన్న కాలనీ



గృహ ప్రవేశం చేసిన వారికి దుస్తులు బహూకరిస్తున్న మంత్రులు, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

సమస్యలన్నీ తక్షణ పరిష్కారం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- గుండమాలలో గడపగడపకు మన ప్రభుత్వం

గుండమాల (కొత్తపట్నం): పెండింగ్ సమస్యలన్నింటినీ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పరిష్కరిస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుండమాల గ్రామంలో గురువారం రెండోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కారాని జయరావు అధ్యక్షత వహించగా, ముందుగా వల్లబుని వెంకటేశ్వరమ్మ నివాసానికి వెళ్లి పథకాలన్నీ అందుతున్నాయా..? అని బాలినేని ఆరా తీశారు. తన కుమార్తెకు మూడు సంవత్సరాలుగా అమ్మ ఒడి పథకం ద్వారా రూ.39 వేలు వచ్చాయని, డ్వాక్రా గ్రూపులో రూ.45 వేలు రుణమాఫీ జరిగిందని, మత్స్యకార భరోసా కింద నాలుగు విడతలుగా రూ.40 వేలు వచ్చాయని ఆమె ఆనందంగా తెలిపింది. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా పథకాలు అందించలేదని చెబుతూ తమ కుటుంబం జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటుందని చెప్పడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాసాని నాగూరమ్మను బాలినేని పరామర్శించారు. పెద్దాస్పత్రికి సిఫార్సు చేసి వైద్యం చేయిస్తానని చెప్పారు. సింగోతు సుజాత ఇంటిని సందర్శించగా, తన పిల్లలకు అమ్మ ఒడి వస్తుందని, జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత తమలాంటి పేద కుటుంబాల పిల్లలకు కూడా ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్య అందుతుందని ఆనందంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పిల్లలకు ఇలాగే నాణ్యమైన విద్య అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ఆమె ఆకాంక్షించారు. నడుం నొప్పితో బాధపడుతున్న సింగోతు మునెమ్మను పరామర్శించి సంక్షేమ పథకాల గురించి బాలినేని అడిగి తెలుసుకున్నారు. నడుంనొప్పికి ఆపరేషన్ చేయిస్తానని చెప్పారు. స్థానిక ప్రజలు తెలిపిన పలు సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామంలో మొత్తం 130 గృహాలను సందర్శించి వారికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సీఎం జగన్ పాలన బాగుందని లబ్ధిదారులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన సమస్య అయిన గ్రామం నుంచి బీచ్‌కు వెళ్లే రోడ్డును గ్రావెల్ రోడ్డుగా మార్చేందుకు వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. రొయ్యల చెరువులకు విద్యుత్ లైన్ ఏర్పాటుకు విద్యుత్ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సరఫరా చేసేలా చూస్తామన్నారు. స్థానిక ప్రజలకు ఎక్కువగా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని బాలినేని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మూడు జిల్లాల మత్స్యకార కార్మిక సంఘ అధ్యక్షుడు గొల్లపోతు నాగార్జున, మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో పి.సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీరేపల్లి రామచంద్రారెడ్డి, హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, ప్రభావతి, మల్లికార్జున, శ్రీరాములు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలి

ఒంగోలు సెంట్రల్: మహిళలు ఎంచుకున్న వృత్తిలో నైపుణ్యాలు సాధించి ఆర్థికంగా అభ్యున్నతి చెందాలని న్యాయవాది, ఫ్యామిలీ కౌన్సిలర్ ఎస్.సరళ పిలుపునిచ్చారు. నైపుణ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కౌశల్ దీక్షిత్ సమరోహ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ డైరెక్టర్ కె.శ్యాంసునీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సరళ మాట్లాడుతూ మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుని పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శ్యాంసునీల్ మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 288 జనశిక్షణ సంస్థల్లో శిక్షణ పూర్తి చేసిన మహిళలందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. జనశిక్షణ సంస్థ పీఓలు రాజేంద్రప్రసాద్, హరికృష్ణంరాజు, మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, లెక్చరర్ ఇందిరా, రమ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మి వైద్యశాలపై ఇద్దరు అధికారులతో విచారణ

- డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి

ఒంగోలు టౌన్: యర్రగొండపాలెంకు చెందిన బెల్లంకొండ ఆదిలక్ష్మి చికిత్సకు రూ.9 లక్షలు వసూలు చేసినట్లు రిమ్స్ వైద్యశాల ఎదురుగా ఉన్న లక్ష్మి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై మీద వచ్చిన ఆరోపణపై కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఇద్దరు అధికారుతో విచారణ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి తెలిపారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. డీటీసీఓ సురేష్, ఆరోగ్యశ్రీ మాజీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌లను విచారణాధికారులుగా నియమించినట్లు తెలిపారు. విచారణ అనంతరం నివేదికను బట్టి ఆస్పత్రి యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోగి కుటుంబసభ్యుల నుంచి వసూలు చేసిన డబ్బులను రీఫండ్ చేయాలన్న కలెక్టర్ ఆదేశాల గురించి మాట్లాడుతూ అస్పత్రి యాజమాన్యంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదిలక్ష్మి చికిత్స తాలూకూ కేస్‌షీట్‌ను లక్ష్మి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల యజమాన్యం బాధితులకు ఇచ్చిందని, ప్రస్తుతం ఆమెకు రిమ్స్ వైద్యశాలలో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

దిశ డీఎస్పీ విచారణ

మార్కాపురం: పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థినిపై లైంగిక దాడి కేసు సంఘటనపై దిశ డీఎస్పీ శ్రీనివాసరావు గురువారం విచారణ నిర్వహించారు. అదే కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఇంటర్ విద్యార్థినిని మాయమాటలతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దీంతో డీఎస్పీ నిందితుడు నివాస గృహంతో పాటు బంధువుల ఇళ్లు, కళాశాల ప్రాంతాలను పరిశీలించారు. యర్రగొండపాలెం మండలం పాలుట్ల గ్రామానికి చెందిన సదరు లెక్చరర్ చేసిన అఘాయిత్యాలపై ఆరా తీశారు. సెల్‌ఫోన్‌లో అసభ్య ఫొటోలు చూపిస్తూ విద్యార్థినిని మాయమాటలతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. దీంతో సదరు లెక్చరర్‌పై లైంగిక దాడి ఫోక్సో చట్టాలతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు అన్నారు. రాష్ట్ర సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని పాఠశాలలకు సరఫరా అయిన లైబ్రరీ బుక్స్‌ను డీఈఓ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ఆయా పాఠశాలలో లైబ్రరీ పిరియడ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పఠనాసక్తిని పెంచాలని కోరారు. పుస్తకాలు మంచి మిత్రులతో సమానమన్న విషయాన్ని విద్యార్థులకు వివరించాలని సూచించారు. ఒంగోలు ఎంఈఓ టి.కిషోర్‌బాబు, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు భేష్

పామూరు: మండల కేంద్రమైన పామూరు పంచాయతీలోని సచివాలయాలను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ పరిశీలకులు శిరీష, సభ్యులు గురువారం సందర్శించారు. మౌలిక సదుపాయాలు, పరిపాలన, వసతులు, పంచాయతీ ఆర్థిక సమీకరణవంటి అంశాలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్పంచ్ అల్లూరి రాగమ్మ, ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్, డీపీఆర్‌సీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రమేష్, డీఎల్‌పీవో శోభన్‌బాబు, డీపీఆర్‌సీ సిబ్బంది ఖాజావలి, సాయి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పీఎస్‌వీ బ్రహ్మానందరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: త్రిపురాంతకం గ్రామ సచివాలయాన్ని సైతం కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ పరిశీలకులు శిరీషాతో పాటు సభ్యుల బృందం గురువారం రాత్రి పరిశీలించింది. గ్రామసచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. డీపీఆర్‌సీ అధికారులు రమేష్, సాయి, ఖాజావలి, గ్రామసర్పంచ్ పొన్న వెంకట లక్ష్మి, ఉప సర్పంచ్ ఆళ్ల కృష్ణారెడ్డి, తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ సాంబశివరావు, ఏపీఓ సుజాత, ఈఓఆర్‌డీ మురళీమోహన్ పాల్గొన్నారు.

- ఆస్తులు కాపాడటంతో పాటు ఉద్యోగులపై నిఘా కూడా ఉంచాలి
- ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు
- ఆర్టీసీలో కారుణ్య నియామకాల ద్వారా ఎంపికైన కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తి
- ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్



శిక్షణ పూర్తిచేసుకుని ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ కానిస్టేబుళ్లు

ఆర్టీసీ పరిరక్షణ బాధ్యత కానిస్టేబుళ్లదే..

ఒంగోలు సబర్బన్: ఏపీఎస్ఆర్టీసీని పరిరక్షించే బాధ్యత ఆ సంస్థలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లదేనని సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియామకాల ద్వారా ఎంపికైన 2023 కానిస్టేబుళ్ల బ్యాచ్‌కు స్థానిక పోలీస్ ట్రెనింగ్ కాలేజీ (పీటీసీ)లో నాలుగు నెలలుగా నిర్వహిస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌కు ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కానిస్టేబుళ్లు నిర్వహించిన పరేడ్ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ నాలుగు నెలలపాటు శిక్షణ పొందిన కానిస్టేబుళ్లను ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్, ఐపీఎస్ అధికారి ఏఆర్ దామోదర్ సుశిక్షితులైన కేడెట్లుగా తీర్చిదిద్దారన్నారు. శాంతి భద్రతల కానిస్టేబుళ్లకు ఇచ్చే శిక్షణ మాదిరిగా ఆర్టీసీ కానిస్టేబుళ్లకు కూడా శిక్షణ ఇవ్వడం మంచి పరిణామమన్నారు. ఆర్టీసీలోని కానిస్టేబుళ్లకు అనేక అదనపు బాధ్యతలు ఉన్నాయన్నారు. ఆర్టీసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడటంతో పాటు పరిరక్షించాలన్నారు. ఆర్టీసీ డిపోలకు, బస్టాండ్‌లకు వచ్చేది పేద, బడుగు, మధ్యతరగతి ప్రజలేనన్నారు. వారందరికీ స్నేహపూర్వకంగా సేవలందించాలన్నారు. ఆర్టీసీ ప్రాంగణాల్లో రక్షణ కల్పించాల్సిన ప్రధాన బాధ్యత కూడా వీరిపైనే ఉందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో టికెట్ల ఫ్రాడ్‌కు సంబంధించి, ఆర్టీసీ ఉద్యోగులపై కూడా నిఘా ఉంచాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు డ్యూటీ ఎక్కేటప్పుడు నిర్వహించే ఆల్కహాల్ పరీక్షలు కూడా మీరే చేపట్టాలన్నారు. డీజిల్ అక్రమ అమ్మకాలతో పాటు గ్యారేజీలలో అక్రమాలు కూడా జరగకుండా చూసుకోవాలన్నారు. ఆర్టీసీ కానిస్టేబుళ్ల శిక్షణలో ఉన్నప్పుడే తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు కూడా పంపించామన్నారు. ప్రధానంగా శిక్షణ పూర్తయిన కానిస్టేబుళ్లు రిటైరయ్యే వరకూ దేహదారుఢ్యంగా ఉండాలన్నారు. ఆర్థిక నియంత్రణతో పాటు కుటుంబాలను ఆనందంగా చూసుకోవాలన్నారు. ప్రమాద బీమా ప్రస్తుతం రూ.85 లక్షల వరకు ఉందన్నారు. సాధారణంగా చనిపోయినా ఈ మొత్తం వస్తుందని వివరించారు. ఒంగోలు పీటీసీలో నాలుగు నెలలపాటు కఠోర శిక్షణ పొందారని, మరో 2 నెలల పాటు ఆర్టీసీ అకాడమీలో కూడా శిక్షణ ఉంటుందని ద్వారకా తిరుమలరావు వెల్లడించారు.

పీటీసీ ప్రిన్సిపాల్, ఐపీఎస్ అధికారి ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ శిక్షణలో ఫైరింగ్, లాఠీ డ్రిల్‌తో పాటు భారత రాజ్యాంగం గురించి కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంస్థను కాపాడటంలో ప్రధాన భూమిక పోషించాలని కానిస్టేబుళ్లకు సూచించారు. ఎంపికైన వారిలో ఎంటెక్ చదివిన వారు ఇద్దరు, బీటెక్ చదివిన వారు–10 మంది, పీజీ చేసిన వారు నలుగురు, డిగ్రీ పూర్తయినవారు 19 మంది ఉన్నారన్నారు. అనంతరం పరేడ్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందించారు. ఎస్పీ మలికాగర్గ్ పీటీసీకి చేరుకుని ద్వారకా తిరుమలరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి, ఏఎస్పీ (అడ్మిన్) కే నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పరేడ్‌ను తిలకించారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీ ద్వారకా తిరుమలరావు


ట్రోఫీ అందుకుంటున్న అరుణ భారతి

గేదెను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు


డివైడర్ ఎక్కిన బస్సు

- డ్రైవర్‌కు గాయాలు
- ప్రయాణికులు క్షేమం

జరుగుమల్లి: ప్రైవేటు బస్సు గేదెను ఢీకొట్టిన ఘటన జాతీయ రహదారి కె.బిట్రగుంట వద్ద గురువారం తెల్లవారు జామున జరిగింది. తిరుపతి నుంచి విజయవాడ వెళుతున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట సమీపంలోకి వచ్చింది. ఫ్లై ఓవర్ ఎక్కుతున్న సమయంలో అడ్డం వచ్చిన గేదెను బస్సు ఢీకొని పక్కనే ఉన్న డివైడరు ఎక్కి రోడ్డు మీదకు ఒరిగింది. బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. ఒంగోలుకు చెందిన డ్రైవర్ బి.గోపికి కుడి కాలు విరిగింది. హైవే మొబైల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు క్లియర్ చేశారు. జరుగుమల్లి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


అంబులెన్స్‌లో డ్రైవర్‌ని తరలిస్తున్న పోలీసులు

జగన్ ఏది చేసినా చారిత్రాత్మకమే

- 7.43 లక్షలు ఇళ్లు పూర్తిచేసి ఘన చరిత్ర సృష్టించాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏది చేసినా అది ఒక హిస్టరీ అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. గురువారం రాత్రి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడ్కో ఇళ్ల చంద్రబాబు హయాంలో ఎందుకు పూర్తి చేయాలేక పోయారో సమాధానం చెప్పాలన్నారు. దద్దమ్మ ప్రభుత్వం కాబట్టే కనీసం వసతులు కూడా కల్పించలేదని.. కేవలం కమిషన్ల కోసం హడావిడిగా పనులు ప్రారంభించి వదిలేశారన్నారు. కానీ తమ ప్రభుత్వం 23 లక్షల గృహాలు నిర్మించాలని భావించడంతో పాటు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 7.43 లక్షల గృహాలు పూర్తిచేసుకుని వాటిని ప్రారంభించామన్నారు. ఇది రాష్ట్ర, దేశ చరిత్రలోనే రికార్డు అన్నారు. టిడ్కో ఇళ్లు ఇప్పుడు ప్రారంభించాలంటే వాటికి విద్యుత్, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి వసతి ఇలా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానులకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తప్పకుండా మూడు రాజధానులు ఏర్పాటుచేసి తీరుతామని స్పష్టం చేశారు. తాను బీజేపీ వంటి జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి చెల్లెలి కుమారుడ్ని అమిత్‌షా వద్దకు తీసుకువెళ్లినపుడే ఆమె ఎవరికోసం పనిచేస్తుందో అర్థం అవుతుందన్నారు. ఇక పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోనే బలీయమైన సెక్టార్ ఉన్నప్పటికీ ఆయన పార్టీని ఎవరికోసం పెట్టారో , ఎందుకు అమ్ముకుంటున్నారో ప్రజలు గ్రహిస్తున్నారన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగర్జున

66 వాహనాలకు వేలం

- వేలంలో రూ.16,49,300 ఆదాయం
- ఉపరవాణా శాఖ కమిషనర్ సుశీల

దర్శి: స్థానిక ఎంవీఐ కార్యాలయంలో గురువారం 66 వాహనాలనువేలం వేయగా రూ.16,49,300 ఆదాయం వచ్చినట్లు ఉపరవాణా శాఖ కమిషనర్ ఆర్ సుశీల తెలిపారు. స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వివిధ కారణాలతో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలంపాట వేశారు. వేలంపాటకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మందికి పైగా వేలంపాటదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ సుశీల మాట్లాడుతూ వేలంలో పాడుకున్న వాహనాల్లో ఫిట్‌నెస్, పత్రాలు ఇచ్చిన వాటిని మాత్రమే రోడ్లపై తిప్పుకోవాలని సూచించారు. కాటా పద్ధతిలో వేలం వేసిన వాహనాలకు ఫిట్‌నెస్ కానీ, మిగిలిన పత్రాలు ఏం ఉండవని చెప్పారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు సీజ్ చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం ఆర్టీఓ బి.అమర్‌నాయక్, దర్శి ఎంవీఐ పి.రవికుమార్, ఏఓలు సుధాకర్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంవీఐ ఆర్ సుశీల

జిల్లాకు చేరిన సాగర్ జలాలు

- జిల్లా తాగునీటి అవసరాలకు నీరు విడుదల


ప్రకాశం జిల్లాకు చేరిన సాగర్ జలాలు

త్రిపురాంతకం: జిల్లా తాగునీటి అవసరాలకు సాగర్ జలాలు విడుదల చేశారు. నాగార్జున సాగర్ ప్రధాన కాలువ జిల్లా సరిహద్దు 85–3 వద్ద 2,646 క్యూసెక్కుల నీటిసరఫరా సాగుతోంది. జిల్లాలోని ఎస్ఎస్ ట్యాంకులు, తాగునీటి చెరువులు నింపేందుకు సాగర్ జలాలను విడుదల చేశారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల నీటి సరఫరా నిమిత్తం పది టీఎంసీల నీటిని సాగర్ జలాశయం నుంచి విడుదల చేయనున్నారు. ప్రస్తుత నీటి సరఫరా ప్రకారం పదిరోజులు వరకు నీటిసరఫరా జరిగే అవకాశం ఉంది. జిల్లాలో సుమారు రెండువందల వరకు తాగునీటి చెరువులు నింపేందుకు అవకాశం ఉంది. నీటిని వృథా చేయకుండా ఎస్ఎస్ ట్యాంకులు, తాగునీటి చెరువులు, కుంటలను నింపితే చాలా వరకు ఉపయోగం ఉంటుంది. సాగర్ జలాలు విడుదలైనందున నీటిని సాగర్ అధికారులతో పాటు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

అత్తపై దాడి చేసి..భయంతో ఆత్మహత్య


ఫ్రాన్సిస్ మృతదేహం, చికిత్స పొందుతున్న కాంతమ్మ

సీఎస్‌పురం (పామూరు): అత్తపై అల్లుడు దాడి చేసి గాయపరిచి ఆపై భయంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం రాత్రి వెలుగుచూసింది. మండలంలోని వి.బైలులో జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని వి.బైలు గ్రామానికి చెందిన పూసలపాటి ఫ్రాన్సిస్ అదే గ్రామానికి చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. ఫ్రాన్సిస్ మద్యానికి బానిసై తరచూ భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో తన కుమార్తెను ఎందుకు కొడుతున్నావంటూ అత్త కాంతమ్మ నిలదీసేది. దీంతో అత్తపై కోపం పెంచుకున్న ఫ్రాన్సిస్ బుధవారం అర్ధరాత్రి సమయంలో అత్త కాంతమ్మ తలపై రోకలిబండతో దాడిచేసి గాయపరిచాడు. ఆమె కేకలు వేయడంతో నిద్రమేల్కొన్న వారు క్షతగాత్రురాలిని ప్రథమచికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. కాగా ఫ్రాన్సిస్ గురువారం బయట కనిపించకపోగా కిటికీలోంచి చూడగా ఫ్రాన్సిస్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో గురువారం రాత్రి సంఘటనా స్థలానికి చేరుకున్న పామూరు సీఐ కాటూరి శ్రీనివాసరావు, ఎస్సై పి.అనిల్‌కుమార్ మృతిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. మృతిపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

మెరుగైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

టంగుటూరు: రైతులు మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త అన్నపూర్ణ అన్నారు. మండలంలోని ఎం నిడమానూరు, కొణిజేడు, తూర్పునాయుడుపాలెం రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ అన్నపూర్ణ అధ్యక్షతన పంటల్లో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులైన విత్తనశుద్ధి, జీవన ఎరువుల వాడకం, పచ్చిరొట్ట పైర్ల ప్రాముఖ్యత వంటి విషయాలను రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ అధికారి తేజ ఉద్యానశాఖ ద్వారా అవలంబిస్తున్న వివిధ పథకాలు, మిరప పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజారాణి రైతు వారి పంటల వాట్సాప్ గ్రూపుల ద్వారా సాంకేతిక సమాచారాన్ని రైతులకు ఏ విధంగా చేరవేస్తున్నారో తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ శేషమ్మ వరి, మినుము, శనగ, పొగాకు పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్లు, వాటి యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఎం. నిడమానూరు, కొణిజేడు, తూర్పునాయుడుపాలెం ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్, రైతులు పాల్గొన్నారు.


కొణిజేడులో వ్యవసాయ పద్ధతుల పుస్తకాలు అందజేస్తున్న ఆత్మ పీడీ

ఫెన్సింగ్ పోటీలకు

జిల్లా జట్ల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఫెన్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఒంగోలు: రాష్ట్రస్థాయి సీనియర్ అండర్ 23 ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక గురువారం స్థానిక గాంధీపార్కులో నిర్వహించారు. ఎంపిక ప్రక్రియకు జిల్లా నలుమూలల నుంచి 80 మంది హాజరయ్యారు. ఎంపికైన ఫెన్సింగ్ క్రీడాకారులు ఈ నెల 14,15 తేదీల్లో కాకినాడలో జరిగే 10వ రాష్ట్రస్థాయి సీనియర్ , 7వ రాష్ట్రస్థాయి యూత్ (అండర్ 23) విభాగాల్లో జిల్లా తరుపున పాల్గొంటారని జిల్లా అధ్యక్షుడు జి.నవీన్ తెలిపారు. ఫాయిల్, ఈపీ, సెబర్ విభాగాలలో క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి శివ, కార్యదర్శి జి.నవీన్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రాభాస్కరరావు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

సీనియర్స్ పురుషులు: ఫాయిల్ విభాగం: జి.మణితేజ్‌చౌదరి సీహెచ్ రాజయ్య, డి.రాజు, బి.భరత్
ఈపీ విభాగం: డి.శ్రీనివాసులు, ఎం ఆదినారాయణ, రామాంజనేయులు, ఎం.నాగేశ్వరరావు
సెబర్ విభాగం: కేవీ సత్యసాయి, త్రినాథ్
సీనియర్స్ మహిళలు:
ఫాయిల్ విభాగం: జి.చైత్ర, పి.తనుశ్రీ, లావణ్య, పి.విజయలక్ష్మి
ఈపీ విభాగం: కె.సాయిశృతి, కె.తనూజ, బి.నమ్రత, డి.ఏక్తాహన్సిక
సెబర్ విభాగం: కె.నాగజాహ్నవి, ఆర్.కీర్తన, ఆర్.విజయలక్ష్మి
అండర్ 23 పురుషుల విభాగం
ఈపీ విభాగం: జి.మణితేజ్ చౌదరి, లోకేష్ సాయి పూజిత్‌కుమార్, వై.చరణ్
సెబర్ విభాగం: కేవీ సత్యసాయి
అండర్ 23 స్త్రీల విభాగం..
ఈపీ విభాగం: ఎస్‌కె ఆసిఫా, బి.నమ్రత, డి.ఏక్తా హన్సిక, కె.సాయిశృతి
సెబర్ విభాగం: కె.నాగజాహ్నవి, ఆర్.కీర్తన, వి.పూజిత, సీహెచ్ వర్షిణి
ఫాయిల్ విభాగం: కె.తనూజ, జి.చైత్ర, పి.విజయలక్ష్మి, ప్రణీత